



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలో నాయకులు, నిర్వాసితులు

భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

నాసన్ , బెల్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు సంస్థలలో చేపడుతున్న ఉద్యోగ నియామకాల్లో నిర్వాసితులకు చదువుతో నిమిత్తం లేకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలసముద్రం చిన్న బాబయ్యపల్లి భూ నిర్వాసితులు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు అధ్యక్షతన సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎఒ ఛాంబర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో పాల్గొన్న పెద్దన్న మాట్లాడుతూ నాసన్ , బెల్ ప్రభుత్వ సంస్థలకు గోరంట్ల మండలం పాలసముద్రం, సోమందేపల్లి మండలం చిన్న బాబయ్య పల్లి , కావేటి నాగేపల్లి గ్రామాలకు చెందిన పేద , దళిత వెనుకబడిన వర్గాల రైతులు భూములు చౌక ధరలకు ఇచ్చి సహకరించారని తెలిపారు. వీరికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. స్థానికేతరులకు , అధికార పార్టీ నాయకులు , ప్రజాప్రతినిధులు సిఫారసు చేసిన వారికి ఉపాధి అవకాశాలు ఇచ్చి నిర్వాసితుల కడుపు కొడుతున్నారన్నారు. ఇదే విషయమై ఇప్పటికే పలుమార్లు సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్, ఎపిఐఐసికార్యాలయాల వద్ద నిరసనలు ,ధర్నాలు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం గత మూడు సంవత్సరాల నుండి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పట్టించుకుంటున్న పాపాన పోలేదని విమర్శించారు. భూములు ఇచ్చి ఉపాధి కోల్పోయి బతుకు తెరువు కోసం వలస వెళుతున్న రైతుల కుటుంబాలు గత్యంతరం లేక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారన్నారు. నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇచ్చి పరిష్కారం చేసేంతవరకు తమ నిరసనను కొనసాగిస్తామని హెచ్చరించారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని లేని పక్షంలో ఈనెల 25వ తేదీ నుండి 72 గంటల పాటు భూ నిర్వాసితులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పుతో నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాసన్ , బెల్ భూ నిర్వాసితులు వెంకట లక్ష్మమ్మ , వెంకట్రాముడు , కదిరప్ప, గంగమ్మ, ప్రవీణ్, అచ్చమ్మ , వెంకటరామిరెడ్డితో పాటు 50 మంది నిర్వాసితులు పాల్గొన్నారు.

'పెట్రో' దోపిడీ



పెట్రోల్‌బంకుల్లో యథేచ్ఛగా అక్రమాలు పట్టించుకోని తనిఖీ అధికారులు

పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వాలు అడ్డూఅదుపు లేకుండా పెంచుకుంటూ పోతుండటంతో నిత్యం ప్రజల జేబుకు చిల్లు పడుతోంది. గోరుచుట్టుపై రోకటి పోటులా పెట్రోల్ ధరలతో పాటు పెట్రోల్ బంకుల్లో కల్తీలు, అక్రమాలు పెరగడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. పెట్రోల్ బంకుల్లో జరిగే అవినీతిలో ఎవరి వాటా ఎంతో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారి పెట్రోల్‌బంకులను తనిఖీ చేపట్టకపోవడంతో బంకు నిర్వాహకులు ఎంత పోస్తే అంతే లీటరు అన్న చందంగా మారిపోయింది. వినియోగదారుల నుంచి అడ్డంగా దోచుకుంటున్న డబ్బుల్లో ఎవరి వాటా ఎంత అన్నది పంచుకునే వారికే ఎరుక...

ప్రజాశక్తి-హిందూపురం

మానవ జీవితంలో పెట్రోల్ అనేది నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల సంఖ్య పెరిగే కొద్ది పెట్రోల్ బంకుల్లో తేడాలు కూడా అదే స్థాయిలో సాగుతున్నాయి. దీనివల్ల వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. అనేక పెట్రోల్ బంకుల్లో అంతర్గతంగా ఏర్పాటు చేసుకున్న కొలతల ద్వారా పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎక్కువ శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యతా పరీక్షకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండకపోవడం, కనీస సౌకర్యాలు లేకపోవటం అందరూ గమనిస్తున్న అంశాలు. పెట్రోల్ బంకుల్లో జరిగే మోసాలను అరికట్టడానికి తూనికలు కొలతల శాఖ, పౌరసరఫరాలు, రెవిన్యూ అధికారులతో పాటు ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎప్పటికప్పుడు తనఖీలు చేయాల్సుంది. అయితే అధికారులు తనిఖీలు చేయకపోవడం వల్లే బంకుల్లో ఇలాంటి మోసాలు హెచ్చుమీరుపోతున్నాయని వినియోగదారులు విమర్శిస్తున్నారు.

పెట్రోల్ బంకులపై పర్యవేక్షణ కరువు

జిల్లాల్లోని పెట్రోల్ బంకులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో యథేచ్ఛగా రీడింగ్ మీటర్‌ను ట్యాంపరింగ్ చేస్తూ కొన్ని బంకుల యాజమాన్యాలు వాహనదారులను దోచుకుంటున్నాయి. గతంలో ఎన్నోసార్లు పెట్రోల్‌బంక్ నిర్వాహకులు చేస్తున్న అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. నామమాత్రంగా చర్యలు తీసుకోవడం.. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో వందకు పైగానే పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో 15కుపైగా పెట్రోల్ బంక్‌లుండగా గ్రామీణ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో మరిన్ని పెట్రోల్ బంక్‌లున్నాయి. రోజుకు పెట్రోల్ 1.30 లక్షల లీటర్లు, డిజిల్ 1 లక్ష లీటర్లు విక్రయిస్తున్నారు. వీటిని పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతలశాఖ, రెవెన్యూ విభాగాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. తహశీల్దార్లు, ఆర్‌డిఒలు తరచూ తనిఖీలు చేయాల్సి ఉండగా వారు ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమవుతూ తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కనీస సౌకర్యాలు, కల్తీ వంటి వాటిపై నిఘా ఊసేలేదు. దీంతో నిబంధనలు నీటిమీద రాతలుగా మారుతున్నాయి.

పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు మృగ్యం

జిల్లాలోని చాలా పెట్రోల్ బంక్‌ల్లో కనీస సౌకర్యాలు ఎక్కడా కానరావడం లేదు. నిబంధనల ప్రకారం తాగునీరు, గాలినింపే యంత్రం, మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలి. విశ్రాంతి తీసుకునేందుకు వసతి ఏర్పాటు చేయాలి. ఈ మేరకు సెస్ వసూలు జరుగుతోంది. వాహనాలకు ఉచితంగా గాలి నింపే పరికరాలు తప్పనిసరి. టైర్లలో గాలి ఒత్తిడి సరిగ్గా లేకపోవడంతోనే ఇంధనం అత్యధికంగా వినియోగం అవుతుంది. డిజిటల్ మీటర్లను అన్ని బంక్‌ల్లో బిగించాలని చమురు సంస్థలు గతంలోనే ఆదేశించినా ఇంకా కొన్ని బంకుల్లో పూర్తి స్థాయిలో డిజిటల్ మీటర్లను బిగించలేదు.

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

తూనికలు, కొలతలశాఖ అధికారులు ప్రతి సంవత్సరం తూకాలను పరిశీలించి సీల్ చేస్తారు. కంపెనీల ప్రతినిధులు కూడా కొలతలను పరిశీలించాలి. అన్ని పెట్రోల్ బంక్‌ల్లో డీలర్ పేరు, ఫోన్ నెంబర్, డిఎస్‌ఒ, వారి సెల్‌ఫోన్ నెంబర్లు, వెబ్‌సైట్ అడ్రస్, టోల్‌ఫ్రీ నెంబర్ వినియోగదారులకు కనిపించేలా ఉండాలి. అన్ని బంక్‌ల్లో హైడ్రోమీటర్, ఫిల్టర్ పేపర్, ఐదు లీటర్ల క్యాన్‌లు సిద్ధంగా ఉంచాలి. అవి అనేక చోట్ల అందుబాటులో ఉంచడం లేదు. బ్లూ టుత్ ద్వారా తూకంలో మోసాలు చేస్తున్నారని తెలుస్తుంది. బంక్‌కు సంబంధించిన భూమి వివరాలు, లీజ్ అగ్రిమెంట్, పట్టణంలో అయితే మున్సిపల్ సంస్థ అనుమతులను రెవెన్యూశాఖ పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే పౌరసరఫరాలశాఖ సరైన వసతులను, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ వ్యాట్, వివిధ రకాల పన్నులను చూసి అనుమతించాలి. అగ్నిమాపక శాఖ ప్రమాదాల నివారణ చర్యలను పరిశీలించాల్సి ఉంటుంది. ఆయా శాఖలలో సిబ్బంది కొరత నేపథ్యంలో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొరవడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కల్తీ తెలుసుకోవడం ఇలా..

పెట్రోల్ పంపు నాజిల్ నుంచి ఒక చుక్క పెట్రోల్‌ను ఫిల్టర్ కాగితంపై వేయాలి. పెట్రోల్ ఆవిరై కాగితంపై మరకలు లేక పోతే కల్తీ లేదని గ్రహించాలి. పెట్రోల్ బంకులకు ఆయిల్ తీసుకొచ్చేటప్పుడు ఇంధన సాంద్రతను వినియోగదారుడికి తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. పెట్రోల్ అయితే నాలుగు, డీజిల్ అయితే రెండు చొప్పున నమూనా బాక్సుల్లో సాంద్రతను నమోదు చేయాలి. కంపెనీ నుంచి వచ్చిన ఇంధనం, బంకుల్లో నమో దైన ఇంధన సాంద్రత మధ్య మూడు పాయింట్లు మించితే కల్తీ జరిగినట్లేనని గ్రహించాలి.

మొబైల్ వాహనంలో డిజిల్ అమ్మకాలు : కొంత మంది పెట్రోల్ బంకుల యజమానులు నిబంధనలను అతిక్రమించి కర్నాటక నుంచి డీజిల్ తీసుకు వచ్చి మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసుకుని పరిశ్రమల వద్దకు వెళ్లి అక్కడే వాహనాలలో నింపుతున్నారు. ఈ వాహనాలకు కనీసం పర్మిట్లు సైతం లేవు. పెట్రోల్ అయిపోయి వాహనం ఎక్కడైన నిలబడి పోతే సామాన్యులు బాటిల్ తీసుకుని వెళ్లి బంకులలో పెట్రోల్ వేయమని అడిగితే సవాలక్ష నిబంధనలు చెబుతారు. అయితే వేలకు వేల లీటర్ల డిజిల్‌ను గోరంట్ల రోడ్డులో ఉన్నా పరిశ్రమ వద్దకు మొబైల్ వాహనం ద్వారా తీసుకెళ్లి ఎలా విక్రయిస్తున్నారు? ప్రమాదకర స్థాయిలో డీజిల్ అమ్మకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. హిందూపురం పట్టణంలో కొంతమంది ఈ అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కర్నాటక నుండి మొబైల్ వ్యాన్ల ద్వారా డీజిల్ రవాణా చేసి పరిశ్రమల్లో యంత్రాలకు, బస్సులకు యథేచ్ఛగా అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో తప్ప ఇతర ప్రాంతాల్లోకి రవాణా చేయరాదు. రవాణా చేయాలంటే నిబంధనల ప్రకారం పెట్రోలియం శాఖ నుంచి అనుమతులు తీసుకొని ట్యాంకర్ల ద్వారా మాత్రమే రవాణా చేయాల్సి ఉంది. అలాకాకుండా ప్లాస్టిక్ ట్యాంకర్లలో డీజిల్ రవాణా చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదు.



గోరంట్ల వద్ద ఉన్న పరిశ్రమ వద్ద మొబైల్ వ్యాన్ ద్వారా వాహనాలకు డిజీల్ వేస్తున్న దృశ్యం
(ఇన్‌సెట్‌లో మొబైల్ వాహనంలో అమర్చిన పెట్రోల్ వేయడాన్ని చూపే డిజిటల్ మీటర్)



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు, నాయకులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని బోయపేట కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ కాలనీ మహిళలు సోమవారం రోడ్డెక్కారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా తాగునీరు సరఫరా చేయడంలో సర్పంచి, అధికారులు విచక్షణ చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆఖరికి ఉన్నత స్థాయి అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు రోడ్డుపై నుండి వెళ్ళమని భీష్మించుకు కూర్చొన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు అయినప్పటికీ మహిళలు వినలేదు. ఈ నేపథ్యంలో మంత్రి సవితమ్మ పిఎ శ్రీనివాసులు, కో కన్వీనర్ మంజునాథ్ సమాచారం తెలుసుకుని నీటి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మహిళలకు ఫోన్ ద్వారా హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముదిగుబ్బ విద్యార్థులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముదిగుబ్బలోని శాంతి ఆనంద పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. అథ్లెటిక్ ఫెయిర్ లో డి. మేఘన, రీనా, ఆర్కిటిక్ పెయిర్ లో కార్తికేయ , అఖిల్, రిథమిక ఫెయిర్‌లో షాకీర్, సురేంద్ర అర్హత సాధించినట్లు ఆపాఠశాల నిర్వాహకులు తెలిపారు. వీరు సెప్టెంబర్‌లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు హాజరవుతారని శాంతి ఆనంద పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొగ్గు రాజశేఖర్ ప్రెసిడెంట్ చంద్రమోహన్ తెలిపారు. యోగా పోటీల్లో ప్రతిభ కనపర్చిన తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను, యోగా గురువు ప్రభావతిని ఎంఇఒ రమణప్ప అభినందించారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

కలెక్టర్ టిఎస్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రమ వేత్తలకు అన్ని విధాల సహకారం, ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నూతన పాలసీ అమలుకు సూచనలు సలహాలు అభిప్రాయాలపై ఎగుమతి ప్రోత్సాహక కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం అమలు చేయనున్న నేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. అందుకు బ్యాంకులు కూడా ముందుకు వస్తాయన్నారు. ఈ సందర్భంగా హిందూపురం పవర్ లూమ్ అసోసియేషన్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాలసీ వల్ల పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉందన్నారు. మరొక పారిశ్రామిక వేత్త కాళేశ్వర్ రావు మాట్లాడుతూ స్థానికంగా 75 శాతం ఉపాధి అవకాశాలు అర్హులైన వారికి కల్పించాలని కోరారు. అన్ని అంశాలను పరిశీలించి ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా, ఎంపిఐఐసి జోనల్ మేనేజర్ సోనీ, చేనేత జౌళి శాఖ అధికారి రమేష్, ఎస్ఎఫ్‌సి అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్, ఎల్‌డిఎం రమణ కుమార్, పలువురు పారిశ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరుగు పోటీలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఈనెల 29 జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 21న కొత్తచెరువు గవర్నమెంట్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో పరుగుపందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆట్రస్టు ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. కొత్తచెరువు, పుట్టపర్తి ,బుక్కపట్నం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అండర్ 14, 17 విభాగాల్లో 100, 200 మీటర్ల పరుగు పందాల పోటీల నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు బ్రోచర్‌ను డిఇఒ మీనాక్షి సోమవారం



బ్రోచరు విడుదల చేస్తున్న డిఇఒ మీనాక్షి, తదితరులు

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించడానికి ఆత్మీయ ట్రస్ట్ పరుగు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లపల్లి ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబు, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి

ఆత్మీయ సమ్మేళనంలో 'అనంత' ఎంపీ అంబికా



ఎంపీ అంబికా లక్ష్మినారాయణను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాల్మీకి ప్రజాప్రతినిధులను కలుపుకుని వచ్చే ఐదు సంవత్సరాలలోపు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తన వంతు కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని వాల్మీకి భవన్ లో వాల్మీకి సేవా సంఘం, వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, శాసనమండలి సభ్యులు మంగమ్మ, మధుసూదన్, హిందూపురం మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణ, బేవినహళ్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నప్పటికీ వాల్మీకులను గుర్తించింది తెలుగుదేశం పార్టీ ఒక్కటే అన్నారు. 2014 రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలోనే, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా నివేదికను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం చేయడంతో ప్రక్రియ ఎక్కడికక్కడే ఆగిపోయిందన్నారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాల్మీకి ప్రజా ప్రతినిధులను కలుపుకుని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తానన్నారు. అనంతపురం ఎంపీగా గెలిచినప్పటికీ, హిందూపురం ప్రాంత అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు శాసనమండలి సభ్యులు మంగమ్మ, మధుసూదన్, ఇతర ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు నరసింహులు, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణ, వాల్మీకి సేవా సంఘం నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలో సర్వమత దేవతలను ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడానికి సత్యసాయి ట్రస్టు సభ్యులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఇంజనీర్లు మున్సిపల్ అధికారులు సోమవారం పలు ప్రదేశాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలో సర్వమత దేవతల విగ్రహాల ఏర్పాటుకు చేసేలా సత్యసాయి ట్రస్టు చర్యలు చేపట్టిందన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు సత్యసాయి ట్రస్ట్ ఇంజనీర్లు రామేశ్వర్, ట్రస్టీ చలం , సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ వ్యక్తి గత కార్యదర్శి సతీష్ నాయక్ , ఆర్‌అండ్‌బి డీఈ శ్రీనివాస్ రెడ్డి ,మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పుట్టపర్తి పట్టణ సిఐ సునీత తదితరులు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారుల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ ఆవరణంలో బుద్ధుడు విగ్రహాన్ని, మామిళ్ళకుంట క్రాస్ లో హనుమాన్ విగ్రహాన్ని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జంక్షన్ లో గురునానక్ విగ్రహం, వై. జంక్షన్ లో జీసస్ విగ్రహం, సత్య సాయి సర్కిల్లో శ్రీకృష్ణుడి విగ్రహం, అటు నుంచి పడమర గోపురం వెళ్లే



విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

రహదారిలో పెద్ద కమ్మవారిపల్లి జంక్షన్లో షిర్డీసాయి విగ్రహం, గణేష్ సర్కిల్లో వినాయకుని విగ్రహం, సత్తెమ్మ టెంపుల్ వద్ద శ్రీరాముని విగ్రహం, చిత్రావతి బ్రిడ్జి వద్ద శివుని విగ్రహం, కర్నాటక నాగేపల్లి సర్కిల్లో గరుడ విగ్రహం ఏర్పాటు చేసేలా స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సర్వమత దేవతల విగ్రహాల ఏర్పాటుకు సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన పలుపార్టీల నాయకులు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని రొళ్ల, గుడిబండలోని వివిధ గ్రామాలకు చెందిన ఇతర పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు టిడిపిలో చేరారు. మండల పరిధిలోని జిల్లెడగుంట, భక్తరపల్లి తదితర గ్రామాలలో మాజీ డీలర్లు సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నుండి టిడిపిలోకి చేరారు. ఈసందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈసందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా నివేదికలు ఉండాలి

కలెక్టర్ టిఎస్. చేతన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా వచ్చే నెల ఒకటవ తేదీ కి అన్ని శాఖల అధికారులు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలచే అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డ్ సచివాలయాల మోడల్ అధికారి శివారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా ఆయా శాఖల అధికారులు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా ఆదాయం, ఉత్పత్తులు జరిగి ప్రజల జీవన విధానం పెంచే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ప్రణాళికలలో ఆర్థిక అంశాలే కాకుండా ఆర్థికేతర అంశాలు గుర్తించి అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వంద శాతం అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రతి శాఖలో తమ బలం, బలహీనతలు గుర్తించి వాటికి తగ్గట్టుగానే ప్రణాళికను ఉండాలని సూచించారు.

పర్యాటక కేంద్రాల గోడ పత్రికలు విడుదల

జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ టిఎస్ చేతన్ స్థానిక కలెక్టరేట్లో విడుదల చేశారు. పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను వివరించే గోడ పత్రికలతో పర్యాటకులకు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సెప్టెంబర్ 5వ తేదీకి పర్యాటక కేంద్రాల విశేషాలను తెలియచెప్పే విధంగా ఆసక్తి గల వారు వీడియోలను అందజేస్తే బహుమతులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి సుబ్బారావు, పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రేమ పేరుతో మోసం

సిడిపిఒ సంరక్షణలో యువతి
నిందితుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రేమ పేరుతో యువతిని నమ్మించిన ఓ యువకుడు ఆమెను శారీరకంగా లొంగదీసుకుని మోసం చేసిన సంఘటన సోమవారం హిందూపురం రూరల్ మండలం గోళాపురం గ్రామంలో వెలుగు చూసింది. పోలీసులు, యువతి తల్లిదండ్రులు తెలిపిన వివరాలు... గోళాపురం గ్రామానికి చెందిన రాజేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన దళిత పదహారేళ్ల బాలికను ప్రేమ పేరుతో నమ్మించారు. శారీరకంగా లొంగదీసుకుని, గర్భిణిని చేశాడు. బాలిక తల్లిదండ్రులకు బాలికపై అనుమానం రావడంతో కర్నాటక రాష్ట్రం గౌరీబిదనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి పరీక్ష చేయించారు. దీంతో అమ్మాయి గర్భిణి అని తెలియడంతో ఆసుపత్రి సిబ్బంది కర్నాటక పోలీసులకు, ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఐసిడిఎస్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. యువతిని కర్నాటక రాష్ట్రం సిడిపిఒ సంరక్షణకు తీసుకున్నారు. విషయాన్ని కర్నాటక రాష్ట్రం చిక్కబళాపూర్ జిల్లా ఎస్పీ హిందూపురం రూరల్ మండలం అప్ గ్రేడ్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. దీంతో రూరల్ పోలీసులు నిందితుడు రాజేష్ పై ఫోక్సో కేసు నమోదు చేశారు. కాగా నిందితుడు రాజేష్ కొద్ది రోజుల క్రితం అదే గోళాపురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సతీష్ హత్య కేసులో ప్రధాన నిందితుడు. ప్రస్తుతం సతీష్ హత్య కేసులో రాజేష్ జైలులో రిమాండ్ లో ఉన్నాడు. రిమాండ్ కు వెళ్ళకముందు ఇలా తమ బాలికను మోసం చేసి, శారీరకంగా వాడుకొని గర్భిణిని చేశాడంటూ యువతి తల్లిదండ్రులు వాపోయారు. కామాంధుడిపై కఠిన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - నల్లమాడ

నల్లమాడ పంచాయతీ పరిధిలోని చెరువు వాండ్ల పల్లి గ్రామానికి చెందిన మహిళ పాముకాటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన కురుబ లక్ష్మీదేవి (50) సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం వేరుశెనగ పంట నూర్పిడి చేయడానికి కూలి పనికి వెళ్లింది. పనిచేసే చోట పాముకాటుకు గురి కావడంతో గుర్తించిన తోటి కూలీలు హుటాహుటిన నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే లక్ష్మీదేవి అప్పటికే మృతిచెందిందని వైద్యులు ధృవీకరించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని చాగలేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకులకు గాయాలయ్యాయి. బాగేపల్లి నుండి చాగలేరు వైపునకు మంజుల, ఆమె కుమారుడు శశాంక్ వెళుతుండగా మలుపు వద్ద కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మంజుళ, శశాంక్ రెడ్డికి కాళ్లువిరిగాయి. వారిని ప్రయివేటు వాహనంలో హిందూపురంలోని ఓ ప్రేవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి : ఎస్ఎఫ్ఐ



ర్యాలీలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

కలకత్తాలో డ్యూటీలో ఉన్న డాక్టర్ మౌమితపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను అందరిని అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెనుకొండ విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ లో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ డాక్టర్ మౌమిత ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను అందరినీ తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకులు పునీత్, హరితో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

కసాయి తల్లి

పురిటి శిశువును కంపచెట్లల్లో పారేసిన వైనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరు గ్రామం వద్ద ఆమానుషం చోటుచేసుకుంది. గ్రామ శివారులో ఆడ శిశువు మృతదేహం సోమవారం లభ్యమైంది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును కసాయి తల్లిదండ్రులు కంప చెట్లలో పారేసి వెళ్లారు. బహిర్భూమికి వెళ్లిన గ్రామస్తులు గమనించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అప్పటికే శిశువు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఎస్సీ వర్గీకరణ పేరుతో కులాలను విడగొట్టి రిజర్వేషన్ కేటాయించడం సరైన పద్ధతి కాదని మాల మహానాడు నాయకులు విమర్శించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఆంజనేయులు, ఈశ్వరయ్య, చెరుకూరి గంగులయ్య, లక్ష్మీనారాయణ, మనోహర్ మాల, ఇల్లూరి ఆంజనేయులు, టిసి. గంగాధర్, నాగేంద్ర, వెంకటరాముడు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని జేసీ అభిషేక్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రెవిన్యూ సమస్యలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు రెవెన్యూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ గంగా శంకర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

టూటౌన్ సిఐగా రెడ్డప్ప

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం టూటౌన్ సిఐగా రెడ్డప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం వన్‌టౌన్ నుంచి బదిలీపై వచ్చిన రెడ్డప్ప టూటౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.

ఘనంగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ హై స్కూల్ మైదానంలో శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన గొర్తి సుధాకర్ నాయుడు ఆయన సతీమణి గొర్తి భారతీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ చిగిచర్ల ఓబిరెడ్డి, కమతం కాటమయ్య, భీమినేని నాయుడు, సాకే మద్దిలేటి, కొత్తపేట ఆది, పురుషోత్తం గౌడ్, బిజెపి నాయకులు హరీష్, డోలరాజారెడ్డి,సాకే ఓబిలేష్,. జింక చంద్ర, అంబటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

2 వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియషిప్ పోటీలలో కదిరి విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఆదివారం హైదరాబాదు మొయినాబాద్ ఫైర్ ఫాక్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రెండవ జాతీయ స్థాయి కరాటే ఛాంపియషిప్ పోటీలను మాస్టర్ మల్లేష్ యాదవ్ మెమోరియల్ కప్ పేరుతో చీఫ్ ఆర్గనైజేర్ మాస్టర్ సుధాకర్ నిర్వహించారు. ఈ పోటీలలో కదిరి జైన్ పాఠశాల విద్యార్థిని నేహా బంగారు పతకాన్ని సాధించింది. శ్రీ శాంతినికేతన్ పాఠశాల నుండి మహమ్మద్ కైఫ్, రీదాముస్కాన్ బంగారు పతకాన్ని, ఓడిసిలోని శ్రీ విజ్ఞాన్ సిబిఎస్ పాఠశాలకు చెందిన సుదీక్ష బంగారు పతకాన్ని, నందిత రెడ్డి,పాయల్, సన,అల్తాఫ్ హుస్సేన్ రజత పతకాన్ని, యశ్వంత్, హవీష్, కుశల్, వర్షిత్ రెడ్డి, జోషిత, ఆఫ్నాన్ కాంస్య పతకాన్ని సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు వారి వారి పాఠశాలల ప్రిన్సిపాల్స్, అభినందలు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మాస్టర్ షాకీర్,కోచ్ చాందినిని అభినందించారు.



తమకు వచ్చిన బహుమతులతో విద్యార్థులు

పెద్ద కాలువకు తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చిలమత్తూరు

గండిపడిన పెద్దకాలువకు మరమ్మతు పనులను అధికారులు సోమవారం చేపట్టారు. 'చిలమత్తూరు పెద్దకాలువ కు గండి' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ప్రచురితం అయిన వార్తకు అధికారులు, టిడిపి నాయకులు స్పందించారు. టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి తమ పార్టీ కార్యకర్తలు, పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకొని పెద్ద కాలువ గండికి తాత్కాలికంగా ఇసుక, మట్టి సంచులను వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే కాలువ పాక్షికంగా దెబ్బతిన్నందువలన కాలువ మొత్తాన్ని కెనాల్‌గా మార్చేందుకు ఉన్నత ఆదికారులు ప్రతిపాదన పంపినట్లు ఇరిగేషన్ డీఈ యోగానంద్ తెలిపారు. ప్రస్తుతం పై నుండి వచ్చే నీరు ఏ మాత్రం వృథా కాకుండా చూస్తున్నామని టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి చెప్పారు.



గండి పడిన పెద్దకాలువకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

స్థలం చూపించరు... డబ్బులు వెనక్కి ఇవ్వరు...!

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

గోరంట్ల పట్టణంలోని సి ఎఆర్ రెడ్డి కాలనీలో పలువురికి స్థలం చూపించకుండా వారి వద్ద నుండి తీసుకొన్న డబ్బులు వెనక్కి ఇవ్వకుండా కాలం వెల్లదీస్తున్నారని జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. గోరంట్ల పట్టణానికి చెందిన హుస్సేన్ పీరా కుమారుడు ఇక్బాల్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 292 లోని కరావులపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ రామచంద్రారెడ్డి లేఅవుట్ వేసి స్థలాలను పలువురుకు విక్రయించారని అన్నారు. గతంలో ఆయన భార్య చేత కొంతమందికి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అనంతరం అతని సోదరుడు చింత రామిరెడ్డి చేత కొంతమందికి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అయితే వారిద్దరూ మృతిచెందడంతో గతంలో స్థలాలు కొన్నవారికి స్థలాలు చూపించడం లేదని వాపోయారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే రామచంద్రారెడ్డి, అతని కుమారుడు విక్రమ్ సింహారెడ్డి, బాధితులపై దాడులకు దిగుతున్నారని అన్నారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ జిల్లా కోఆర్డినేటర్ వీర మారుతి సాయి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం కొడికొండ చెక్ పోస్ట్ లోని సమర్థనం ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన వికలాంగ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో పాల్గొని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్లో ఒటిపిలను ఇతరులకు చెప్పొద్దని అన్నారు. ఈ సందర్భంగా పలు బీమా పాలసీ వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హరికృష్ణ, ట్రైనర్స్ నరసింహ మూర్తి, శంకరప్ప, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన కమలాకర్ కుటుంబానికి సోమవారం ఆర్థికసాయం అందజేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పి ఛాంబర్‌లో కమలాకర్ భార్య ముత్యాలమ్మకు ఎస్పీ వి. రత్న రూ. 75వేల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, మృతుడి కుటుంబానికి రావలసిన ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా త్వరలోనే అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ విష్ణు , ఎఆర్ డిఎస్పీ విజయ్ కుమార్, ఎఒ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐ చంద్రశేఖర్, ఎఎస్ఐ షౌకత్ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని చెరుకూరు గ్రామానికి చెందిన హనుమంతరయప్పకు చెందిన ఆవు సోమవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. గ్రామానికి సమీపంలోని దోబీఘాట్ వద్ద విద్యుత్ వైర్లను తలిగిన ఆవు విద్యుత్‌షాక్‌తో మృతిచెందిందని దీంతో రూ. 50వేలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. తనను ఆదుకోవాలని కోరాడు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురం గ్రామానికి చెందిన నంజుండప్ప ఇటీవల క్యాన్సర్ తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగికి చెందిన దివ్య ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వేణుగోపాలరావు సోమవారం తన మేనేజర్ శివ ద్వారా మృతుని కుమారుడికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు.

రంగా థియేటర్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలోని రంగా థియేటర్‌లో అధిక ధరకు తినుబండారులు విక్రయిస్తున్న యాజమాన్యంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ధర్మవరం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ నటరాజకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇడపబత్తిని ప్రసాద్, నాయకులు న్యాయవాదులు పెద్దన్న, వెంకట్రాంరెడ్డి, నరసింహమూర్తి, మోహన్ ప్రసాద్, మనికంఠ, సంధ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థియేటర్లో సౌకర్యాలు లేకపోవడంతో పాటు విచ్చలవిడిగా తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శించారు. వీటిపై వెంటనే చర్యలు తీసుకావాలని వారు డిమాండ్ చేశారు.

శ్మశానవాటికకు రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రొద్దం

శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కంబాలపల్లిలో శ్మశాన వాటికకు మృతదేహాలను తీసుకెళ్లడానికి పెద్దవంక ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన దళితుల సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి వంకలో బ్రిడ్జి నిర్మించాలన్నారు. లేనిపక్షంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాధర్, హనుమంతు, కృష్ణమూర్తి, శంకరప్ప, బి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల నందు ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ అవగాహన సదస్సు లో జిల్లా సమన్వయకర్త శ్రీ లాజరస్ మాట్లాడుతూ విద్యాపీఠం 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఓపెన్ స్కూల్‌లో అవకాశం ఉందన్నారు. మధ్యలో చదువు ఆపేసిన వారు చదువుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్, ప్రధానోపాధ్యాయులు గోపాల్, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి- హిందూపురం

విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల ఆరోగ్య పరిరక్షణే పాఠశాల లక్ష్యమని, వారి కోసమే ప్రతి సంవత్సరం అన్ని రకాల రక్త పరీక్షలను నిర్వహించి, స్పెషలిస్ట్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు షర్మిల బేగం, సమత వైద్య సేవలు అందించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ, పాఠశాలలో ప్రతి సంవత్సరం పరిగి సత్యనారాయణ శెట్టి, తాయారమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఉచిత వైద్య శిబిరం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ స్మిత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ నందిత, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరిండెంటెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కదిరి టౌన్

వినాయక చవితి ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి ఆర్‌డిఒ కార్యాలయంలో వినాయక ఉత్సవాల పై సమన్వయ కమిటీ సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధికారులు, మత పెద్దలు పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను సమాజంతో ఆనందం పంచుకునే విధంగా నిర్వహించుకుందామని తెలిపారు. ఉత్సవాలకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం

ఉపాధ్యక్షురాలిగా అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం ఉపాధ్యక్షురాలుగా హిందూపురం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో రాయలసీమ నుండి పోటీ చేసిన హిందూపురం ఆదనపు జిల్లా జడ్జి కంపల్లి శైలజ ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. వరుసగా రెండవసారి శైలజ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పదవికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, జి.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు అదనపు జిల్లా జడ్జిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హిందూపురం అదనపు జిల్లా జడ్జి రాష్ట్రస్థాయి న్యాయమూర్తుల కార్యవర్గంలో ఉపాధ్యక్షురాలుగా ప్రాతినిథ్యం వహించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపి ఇందాద్, న్యాయవాదులు సిద్ధా, గోపాలకృష్ణ, నాగరాజు రెడ్డి, సదాశివరెడ్డి, నాగేంద్ర, కృష్ణమూర్తి, కళావతి, సంతోషి కుమారి, పార్వతి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



కంపల్లె శైలజకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

అత్తింటి వేధింపులతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

అత్తింటి వారి వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్ చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన చింతా లక్ష్మీదేవి, నాగరాజు దంపతుల కుమార్తె భువనేశ్వరి(30)ని ధర్మవరంలోని గాంధీనగర్‌కు చెందిన గుండా ఓబుళేశు, అలివేళమ్మ దం పతుల కుమారుడు విశ్వనాథ్‌కు ఇచ్చి ఆరుసంవత్సరాల క్రితం వివాహం చేశారు. అప్పటి నుంచి వీరి కాపురం సజావుగా సాగింది. అయితే గత కొంతకాలంగా కుటుంబంలో చిన్నచిన్న సమస్యలపై గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో భువనేశ్వరికి వేధింపులు ప్రారంభమయ్యాయి. ఆదివారం కూడా ఇంటిలో గొడవ పడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భువనేశ్వరి ఇంటిలో ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త విశ్వనాథ్ 'మీ అమ్మాయి చనిపోయింద'ని అత్తింటివారికి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమ కూతురు ఆత్మహత్యకు అత్త, భర్త వేధింపులే కారణమని మృతిరాలి తల్లి, బంధువులు వన్ టౌన్ పోలీసులు ఫిర్యాదు చేశారు. మృతురాలికి కుమార్తె లాస్య, కుమారుడు కార్తీక్ ఉన్నారు.



మృతురాలు భువనేశ్వరి (ఫైల్‌ఫోటో)

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



కందికుంటకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



మంత్రి సత్యకుమార్‌కు రాఖీ కడుతున్న మహిళలు



జెఎన్‌టియు విసితో బ్రహ్మకుమారిలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం రక్షాబంధన్ పురస్కరించుకొని పలువురు మహిళలు, బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి రూరల్ : సొంత అక్క చెల్లెళ్లతో పాటు, సమాజంలోని బాలికలు, మహిళలందరినీ సోదర భావంతో చూడాలని శ్రీ సత్య సాయి జిల్లా జిల్లా ఎస్పీ వి రత్న తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఓం శాంతి వారి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ వి.రత్న కి , అదనపు ఎస్‌పి ఎన్. విష్ణుకి రాఖీలు కట్టి ఈ రక్షాబంధన్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఎస్పీ స్వయంగా పోలీస్ అధికారులకు సిబ్బందికి రాఖీలు కట్టి మిఠాయిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐలు శ్రీనివాసులు సతీష్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మహిళలకు రక్షణకు కల్పించే ప్రభుత్వం ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉందని టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. సోమవారం ధర్మవరం టీడీపీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుమహిళలు పెద్దఎత్తున పార్టీ కార్యాలయానికి వచ్చి పరిటాల శ్రీరామ్‌కు రాఖీ కట్టారు.

మడకశిర : రాఖీ పండుగ సందర్భంగా సోమవారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. అదే విధంగా పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఇతర నాయకులకు రాఖీలు కట్టారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపినిర్మల జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అన్నాచెల్లల ప్రేమానురాగాలు, వారిబాధ్యతలు, బంధాలు రాఖీ పం దుగ విశిష్టతను వివరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశరెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలో సోమవారం రాఖీ పౌర్ణమి ఘనంగా జరుపుకొన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సమన్వయకర్త బికె.యోగేశ్వరి ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, జూనియర్ సివిల్ జడ్జి రమ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, పోలీసులు, ఇతర అధికారులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సరస్వతీ శిశు మందిరం విద్యార్థులు ఎమ్మెల్యే కాలవతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, ఉపాధ్యాయులు, అధికారులకు, రాఖీలు కట్టారు.

కళ్యాణదుర్గం : రక్ష బంధన్ సందర్భంగా స్థానిక సరస్వతీ విద్యా మందిరం విద్యార్థులు తహశీల్దార్ కార్యాలయం వెళ్లి తహశీల్దార్ భాస్కర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తహశీల్దార్ విద్యార్థులను ఆశీర్వదించారు

ధర్మవరం టౌన్ : జనసేన పార్టీకార్యాలయంలోసోమవారం రాఖీపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీకి చెందిన నాయకురాళ్లు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శిచిలకం మధుసూదన్‌రెడ్డికి రాఖీ కట్టారు. జనసేన నాయకురాలు కొండాదుర్గమ్మ చిలకం మధుసూదన్‌రెడ్డికి రాఖీ కట్టారు.

అనంతపురం అర్బన్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అనంతపురంలో డిఎంహెచ్ఒ డా. ఇబి దేవి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మవరం టౌన్ : దేశ వ్యాప్తంగా రాఖీ పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం రాఖీ పండుగను సిఎన్‌బి హాల్లో జరుపుకున్నారు. రాఖీ కట్టిన వారందరికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్ ,సాకే ఓబుళేశు, జింకాచంద్రశేఖర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, పలువురు ఆచార్యులకు ప్రజాపిత బ్రహ్మకుమారీ ధ్యాన మందిరం సభ్యులు రక్షాబంధన్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారీలు, ధ్యాన మందిరం సభ్యులు పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి రాఖీలు కట్టారు. కార్యక్రమంలో రాజీవ్ కాలనీ సర్పంచి ఆశాబి, ఎంపీటీసీ సంధ్య, పలువురు కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకులపై తేనెటీగల దాడి

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్ట గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు అమరేంద్ర, విష్ణుపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామ సమీపంలోని వారి వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా విష్ణుపై తేనెటీగలు దాడి చేశాయి. గమనించిన తండ్రి రక్షించేందుకు వెళ్లగా అతడిపై కూడా దాడి చేశాయి. గుర్తించిన సమీప పొలాల రైతులు వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఉత్తమ ఎంఇఒగా అవార్డు అందుకున్న సోమందేపల్లి ఎంఇఒ ఆంజనేయ నాయక్‌ను, ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా అవార్డు అందుకున్న రాజశేఖర్ రెడ్డిని ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎస్ఐ రమేష్ బాబు తదితరులు అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల జాక్టో నాయకులు చంద్ర, సంజీవ రాయుడు, నాగరాజు, శివన్న, రామకృష్ణ నాయక్, అశ్వర్థప్ప, విజయ్ కుమార్ నాయక్, దస్తగిరి, సోమశేఖర్, లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

హెచ్ఐవి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేష్ చౌదరి సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో కదిరి ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్ల చౌదరి, అరుణ, కేర్ స్టాఫ్, జూనియర్ కాలేజ్ ఉపాధ్యాయులు, జనజాగృతి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను గుర్తించాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం చేతివృత్తిదారులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ కోరారు. ఫొటో గ్రాఫర్స్ డే సందర్భంగా వారు సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, బాలాజీ, ప్రసన్న, నవీన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చంద్రన్న ప్రెస్‌క్లబ్లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్స వేడుకలను సోమవారం శిల్క్ సిటీ ఫొటో అండ్ వీడియోవెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్స్ హరి, మూర్తి, రామచంద్ర, అంబిక శ్రీనివాసులను సన్మానించారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీ యూనియన్ నాయకులు రాము, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

ప్రజాశక్తి - యల్లనూరు

మండలంలోని మల్లాగుండ్ల గ్రామంలో ఉన్న 18వ నెంబర్ రేషన్ షాపును సోమవారం విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రరెడ్డి తనిఖీ చేశారు. షాపులో 85 కిలోల బియ్యం తక్కువ వున్నట్లు అధికారులు గుర్తించి షాపును సీజ్ చేశారు. తనిఖీల్లో డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, విఆర్ఒ షబాన, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

కళాకారుల ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఏర్పాటు

హిందూపురం : కళాకారుల ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని కళాకారుల ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి అంజప్ప, గౌరవ సలహాదారుగా మల్లేష్, అధ్యక్షులుగా పి శివకుమార్, ఉపాధ్యక్షులుగా కెకె. శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మిలిటరీ చలపతి, సహాయ కార్యదర్శిగా సంపూర్ణమ్మ, కోశాధికారిగా ఎస్‌టి. దాసప్ప, ప్రోగ్రాం ఆర్గనైజర్‌గా దయానంద్ తో పాటు కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ చంద్ర, శ్రీధర్ గౌడ్, లోకేష్, శంకరప్ప, రాజ్యలక్ష్మి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంట పెట్టుబడి సాయం ఇవ్వాలి

ఉరవకొండ : ప్రభుత్వం రైతులతో పాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద తక్షణమే రూ. 20 వేలు అందజేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను ఖండిస్తూ సోమవారం స్థానిక వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిహెచ్‌సి నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సిహెచ్‌సి వైద్యాధికారి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వమే పూర్తి రక్షణ కల్పించాలన్నారు. వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని మహిళ, ప్రజా సంఘాలు ఖండించాలని, బాధ్యులు ఎంతటి వారైనా చట్ట పరంగా కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీరంగయ్య, స్వర నాగప్ప, సిపిఐ నాయకుడు ఓంకార్, రవిచంద్ర, నారాయణ, పెద్దన్న, మునెయ్య, కోటి, నాగరాజు, ప్రసాద్, టిడిపి నాయకుడు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటుపై ఎమ్మార్పీఎస్ హర్షం

అనంతపురం కలెక్టరేట్ : దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌సెల్ నిర్వహించడం ఎంతో హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యులు బిసిఆర్.దాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి : ప్రభుత్వ సబ్సిడీతో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి సోమవారం తెలిపారు. మామిడి, జామ, అల్లనేరేడు, దానిమ్మ, అరటి, బొప్పాయి మొక్కలు పెట్టుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని న్నారు. అలాగే ఫారంపాండ్స్, ప్యాక్‌కు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-గుత్తి

వాల్మీకి, బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ సోమవారం ఎపి వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లెల్లి కృష్ణయ్య మాట్లాడుతూ వాల్మీకి, బోయలు అన్ని రంగాల్లో వెనుక పడ్డారన్నారు. వారు విద్య, ఉద్యోగ, సామాజిక పరంగా అభివృద్ధి చెందాలంటే గిరిజనుల జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.జయరాం, నాయకులు బి.లాలెశేఖర్, ఎం.సత్యనారాయణ, బి.నవీన్, బి.నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కుందుర్పి : రైతు సంక్షేమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి నాయకులు రవి, రాఘవేంద్రబాబు, హనుమంత రాయుడు, ఆనంద్ తెలిపారు. వారు సోమవారం తహశీల్దార్ ఎస్‌బి.శ్రీనివాసులును సన్మానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అనేక కంపెనీలు తీసుకురావడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారన్నారు.